## అమ్మ చూపిన తొవ్వ ...

శిల్పి, చిత్రకారుడు రాజేశ్‌ది హైదరాబాద్. బాలభవన్‌లో నిర్వహించే వేసవి శిక్షణా శిబిరంలో కళలు నేర్చుకోమని వాళ్లమ్మ శారద చేర్పించింది. అప్పుడు ఆయన వయసు 14 ఏండ్లు. ప్రసిద్ధ చిత్రకారుడు తోట వైకుంఠం అక్కడ ఆర్ట్ టీచర్‌గా ఉండేవాడు. ఆయన దగ్గర ఓనమాలు దిద్దుకున్నాడు రాజేశ్. పాఠశాలలోని ఆర్ట్ టీచర్ నరేంద్ర రాయ్ ప్రోత్సాహమూ అందింది. ఇంటర్ పూర్తయ్యాక 'నీకు ఏది ఇష్టమో అది చేయి, అదే చదువు' అని వాళ్లమ్మ వెన్నుతట్టింది. జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో బీఎఫ్ఏలో చేరాడు. 1998లో చదువు పూర్తయ్యాక పద్మాలయ స్టూడియో, డాటాక్వెస్ట్ సంస్థల్లో 2డీ, 3డీ యానిమేటర్‌గా ఉద్యోగం చేశాడు. అక్కడ పని చేస్తూనే సజీవ శిల్పకళలోకి అడుగులు వేశాడు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత శిఖరాలు అధిరోహించాడు. సజీవ శిల్పకళలో ఆయన చూపిన ప్రతిభకు అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం, ఏయన్నార్ నంది పురస్కారం, పోలీస్ వ్యూ సేవా పురస్కారం అందుకున్నాడు. ఇంగ్లండ్‌లోని హోప్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నాడు.











### స్వీట్ మెమొరీ

'ఎలాంటి విగ్రహం తయారు చేయమన్నా చేస్తా'నంటాడు రాజేశ్. 'ఒకసారి పుల్లారెడ్డి స్వీట్స్ యజమాని రాఘవ రెడ్డి వచ్చి 'మా అమ్మానాన్నల విగ్రహాలు తయారు చేయాలి. వాటిని చూస్తే అచ్చంగా మా అమ్మానాన్నలను చూసినట్టే ఉండాలి! సాధ్యమవుతుందా?' అని అడిగారు. వారి చిత్తరువులు తీసుకొని.. ఆహార్యాన్ని గమనించి పని ప్రారంభించాను. ముందుగా మట్టి విగ్రహ నమూనా చేశాను. వారి కుటుంబసభ్యులకు చూపించి సూచనలు తీసుకున్నాను. అందుకు తగ్గట్టుగా మార్పులు చేసి నిజమైన మనిషిని పోలిన విగ్రహం వారికి అందించాను. ఫైబర్, మిక్స్‌డ్ మీడియంతో ఈ విగ్రహాన్ని మనిషి చర్మంతో ఉన్నట్టుగా తయారు చేశాను' అని చెప్పుకొచ్చాడు రాజేశ్.

'తొలినాళ్లలో ఈ సజీవ శిల్పాలకు తుది రూపునివ్వడం కఠినంగా ఉండేది. అనుభవంతో ఇప్పుడు అలవోకగా చేస్తున్నా'నని రాజేశ్ అనుభవ పాఠాలు చెప్పాడు. మరెందరో పిల్లలు.. తమ తల్లిదండ్రుల రూపాలను ఈ శిల్పిని సంప్రదించి సజీవ మూర్తులుగా తయారు చేయించుకుంటున్నారు. జీవితమంతా కంపెనీలు, సంస్థల నిర్మాణం కోసం శ్రమించిన కార్పొరేట్ విజేతలను గుర్తుంచుకునేందుకు ఆయా కార్యాలయాల్లో గౌరవంగా ఈ ప్రత్యేక విగ్రహాలను ప్రతిష్ఠించుకుంటున్నారు. ఇలా సజీవ శిల్పాల సృష్టితో అశేషమైన కీర్తిని ఆర్జించాడు మన రాజేశ్ . ■

... నాగవర్ధన్ రాయల

### సజీవ శిల్పమా! సిలికాన్ శిల్పమా!

ఒక కళాకారుడు తనదైన శైలిలో ఎన్ని ప్రయోగాలైనా చేయొచ్చు. కానీ, ఉన్నది ఉన్నట్టుగా ఉండాలంటే మాత్రం ఎంతటి సృజనకారుడికైనా కత్తి మీద సామే! సృజనాత్మక కళాకారులకు ఎన్నో ఊహలు వస్తుంటాయి. కానీ, కళ్లెదుటే కనిపించే రూపాన్నే రూపొందించాలంటే మాత్రం ఎంతో కష్టం. సజీవ శిల్పాల తయారీ కూడా అంతే కష్టం. శిల్పి రాజేశ్ ముందు ఒక ఫొటో పెట్టి ఇదే శిల్పం కావాలంటే?.. అచ్చుగుద్దినట్టుగా రూపొందిస్తాడు. ఈ శిల్పాల రూపకల్పనలో మొదట ఫొటోలో ఉన్న మనిషి ఎత్తు, లావు, ముఖాకృతి, శరీర సౌష్టవాన్ని గుర్తిస్తాడు. దాని ఆధారంగా కొలతలతో మట్టి విగ్రహం రూపొందిస్తాడు. ఆ విగ్రహ నమూనాను కుటుంబ సభ్యులకు చూపిస్తాడు. వాళ్లు పరిశీలించి, అవసరమైన మార్పులు సూచిస్తారు. వాళ్ల సూచనలకు అనుగుణంగా మరో మట్టి విగ్రహం రూపొందిస్తాడు. ఆ విగ్రహాన్ని కుటుంబ సభ్యులు అంగీకరిస్తే... నమూనా మూర్తి సిద్ధమైనట్టే. అదే విగ్రహాన్ని ఫైబర్, మిక్స్‌డ్ మీడియంతో తయారు చేస్తాడు. ఈ విగ్రహం ఎంత అద్భుతంగా ఉంటుందంటే?.. చర్మం, దానిపై ఉండే ముడతలు కళ్లను మోసం చేస్తాయంటే అతిశయోక్తి కాదు. మిక్స్‌డ్ ఫైబర్‌తో తయారుచేసిన శిల్పం నిజమైన మనిషిని మన ముందు నిలబెట్టినట్టే ఉంటుంది. కనిపించడమే కాదు. తాకినా నిజమైన మనిషిని తాకినట్టే ఉండాలని విగ్రహ తయారీలో సిలికాన్‌ని ఉపయోగిస్తున్నాడు. అందువల్ల కనులు, కనుబొమలు, చర్మం, అత్యంత సహజంగా ఉంటాయి. కుటుంబసభ్యుల చర్మం రంగును పరిశీలించి, అదే రంగులో విగ్రహం రూపొందిస్తాడు. కనుమరుగైన మనిషిని కళ్లెదుటే ఆవిష్కరించే అద్భుత ప్రయోగం ఇలా జరుగుతున్నదని రాజేశ్ చెబుతున్నాడు.